ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 19 నవంబరు 2024 | 5

నమో..సోమేశ్వరా



- కోటిపల్లి పుణ్య క్షేత్రం..భక్తజన సంద్రం
- ప్రత్యేక అభిషేకాలు

కె.గంగవరం, నవంబరు18: శివనామస్మరణతో కోటిపల్లి పుణ్యక్షేత్రం హోరెత్తింది. కార్తీకమాసం మూడో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో ఛాయా సోమేశ్వర స్వామి వారిని దర్శించున్నారు. వేకువజాము నుంచే భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం లక్షపత్రి పూజ జరిగింది. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ ఈవో భీమశంకరం భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

నమో..భీమేశ్వరా

భక్తులతో కిటకిటలాడిన ద్రాక్షారామ



ద్రాక్షారామ భీమేశ్వరునికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ద్రాక్షారామ, నవంబరు18(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ద్రాక్షారామం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. ఆలయంలో భీమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు చేశారు. పైండా వారి అన్నసత్రంలోను, అలానే ఎరువులు, పురుగుల మందుల దుకాణదారుల సంఘం వారి ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు కుటుంబ సమేతంగా భీమేశ్వరస్వామిని, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఈవో దుర్గాభవాని కలెక్టర్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం అందించారు.

నమో..కుండలేశ్వరా..

కుండలేశ్వరంలో ప్రత్యేక పూజలు



కాట్రేనికోన, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం అధిక సంఖ్యలో భక్తులు కుండలేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలాచరించి గోదావరి మాతను పూజించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్లకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఆవరణలోని రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో గెద్దనపల్లి పంచాయతీ చింతలమెరకకు చెందిన కముజు లక్ష్మీరమణారావు తదితరుల ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో 7000 మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో త్సవటపల్లి నాగు, గోకరకొండ సత్తిబాబు, గంగుమళ్ల భాను, అక్కల నాగ మందేశ్వరరావు, గంగుమళ్ల కిరణ్, మోటిపల్లి శ్రీను, సలాది సతీష్, చిక్కం ఆనందకుమార్, అడపా శివ, అడపా వెంకటేశ్వరరావు, గంగుమళ్ల శంకర్, మీసాల బాలచంద్రరావు పాల్గొన్నారు. ఈవో కె.గంగాధర్ ఆధ్వర్యంలో భక్తులకు వసతి ఏర్పాట్లు చేశారు.

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ

అమలాపురం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతులు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ-2024 ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు జిల్లా సంక్షేమ అధికారి టీవీ ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ (ఈడబ్ల్యూఎస్) కులాలకు చెందిన అభ్యర్థులకు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. బీసీ, ఎస్సీ ఎస్టీ కులాలకు చెందిన 200 మందికి ఈబీసీ కులానికి చెందిన 20 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. బీఈడీ, టీటీసీతో పాటు ఏపీ టెట్ పరీక్షలో అర్హత సాధించి ఉండాలన్నారు. డీఎస్సీ స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఇస్తామన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇతర మార్కుల జాబితాలను, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో ఈ నెల 26వ తేదీలోగా జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి వారి కార్యాలయం అమలాపురం.కు దరఖాస్తులు అందించాలి. ఇతర వివరాలకు సెల్ 9398973754ను సంప్రదించాలని ఆయన కోరారు.

వసూళ్లకు పాల్పడితే చర్యలు

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

ముమ్మిడివరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం పట్టణ పరిధిలో ఇంటి నిర్మాణాలు, వ్యాపార షెడ్ల నిర్మాణం విషయంలో అక్రమ వసూళ్లకు పాల్పడితే విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ పి.రవివర్మ స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 16న వసూల్‌రాజా శీర్షికన ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. ఇంటి నిర్మాణాలు, వ్యాపార షెడ్లను నిర్మించుకోవాలంటే ముందుగా నగర పంచాయతీ కార్యాలయం నుంచి అనుమతి పొంది మొదలు పెట్టాలన్నారు. అనుమతి లేని నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేసి మున్సిపల్ చట్టం ప్రకారం ఆ అక్రమ కట్టడాలను తొలగిస్తున్నామన్నారు. అక్రమ కట్టడాల నిర్మాణాలకు సంబంధించి యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. నగర పంచాయతీ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడితే వారిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



అంబాజీపేటలో ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఉన్న స్టాక్



> పేదల బియ్యాన్ని కొంతమంది అధికారులు మేధావితనంతో పక్కదారి పట్టించారు. అలాగే నిత్యావసర సరుకులను కూడా మాయం చేశారు. ఏళ్ల తరబడి ఈ తంతు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. మొత్తానికి ఈ అవినీతి బాగోతం అధికారుల బదిలీలతో బయటపడింది. ఇటీవల కొత్తగా వచ్చిన అధికారి ఈ మొత్తం వ్యవహారాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు..

ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌లో

దొంగలు పడ్డారు..

- అంబాజీపేటలో పేదల బియ్యం మాయం
- స్టాక్ పాయింట్‌లో అవకతవకలు
- బియ్యం, నిత్యావసర సరుకులను పక్కదారి పట్టించిన ఉద్యోగులు
- రూ.1.75 కోట్ల మేర అవినీతి జరిగినట్లు ఆరోపణ
- గత కొన్నేళ్లుగా జరుగుతున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు
- కొత్తగా వచ్చిన ఓ అధికారి సమాచారంతో బాగోతం బట్టబయలు
- విచారణ జరుగుతున్నవైనం..



అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట ఎంఎల్ఎస్ (మండల లెవెల్ సర్వీస్) స్టాక్ పాయింట్‌లో కోనసీమ పరిధిలోని అమలాపురం, అంబాజీపేట, అల్లవరం, ఉప్పలగుప్తం అయినవిల్లి మండలాలకు సంబంధించి రేషన్ డిపో, అంగన్‌వాడీ, వివిధ పాఠశాలలకు బియ్యాన్ని సరఫరా చేస్తుంటారు. అంబాజీపేట మార్కెట్‌యార్డు శివారులో సివిల్ సప్లై ద్వారా స్టాక్ పాయింట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ స్టాక్ పాయింట్‌కు నిత్యం లారీల ద్వారా బియ్యం, నిత్యావసర సరుకులు దిగుమతి, ఎగుమతి అవుతుంటాయి. అయితే గతంలో చేసిన అధికారులు కోట్లాది రూపాయల బియాన్ని పక్కదారి పట్టించారు. లెక్కల్లో అవకతవకలకు పాల్పడ్డారు. గత కొన్నేళ్ల నుంచి ఈ తంతు జరుగుతున్నా బయటపడలేదంటే ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏమాత్రం ఉందో అర్థమవుతోంది. ఇలా మొత్తతం అంబాజీపేట స్టాక్ పాయింట్ నుంచి సుమారు 366 టన్నుల రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లు తెలిసింది. వీటి విలువ సుమారు రూ.1.70 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. గతంలో డిప్యూటీ తహశీల్దారుగా పనిచేసిన ఓ అధికారి ఈ అవినీతికి పాల్పడినట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన బదిలీల్లో కొత్తగా వచ్చిన అధికారి ఈ లెక్కల తారుమారు, భారీ అవినీతిని చూసి హడలిపోయారు. బాధ్యతలు అప్పగించిన తర్వాత అక్కడ ఉన్న సరుకుకు రిజిస్టర్‌కు మధ్య భారీ వ్యత్యాసాలు కనపడడంతో అతను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ బాగోతం వెలుగుచూసింది. ఓ కమిటీని ఏర్పాటు చేసి విచారించగా అక్కడ భారీగా అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా తెలిసింది.

విధులకు గైర్హాజరు

అంబాజీపేట స్టాక్ పాయింట్‌లో అవినీతి బాగోతాన్ని వెలుగులోకి తీసుకువచ్చిన అధికారిని ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయన స్థానంలో అంబాజీపేట ఎమ్మెస్వోగా పనిచేస్తున్న సత్యనారాయణను స్టాక్ పాయింట్ ఇన్‌చార్జిగా నియమించారు. ఇటీవల ఎమ్మెస్వోగా పనిచేస్తున్న సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించి స్టాక్ పాయింట్‌లో ఉన్న సరుకులు, బియ్యం బస్తాల నిల్వలు, రికార్డులను సరిచూసుకున్నారు. అయితే సోమవారం స్టాక్ పాయింట్‌లో పనిచేస్తున్న కింద స్థాయి కాంట్రాక్టు ఉద్యోగులు విధులు హాజరు కాకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై జిల్లా సివిల్ సప్లై డీఎంను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా స్పందించలేదు.

పర్యవేక్షణ లోపం..

అంబాజీపేట స్టాక్ పాయింట్‌లో సుమారు 380 టన్నులకు కేవలం 14 టన్నులు మాత్రమే ఉండటంతో జిల్లా అధికారులు ఎందుకు పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా జరుగుతున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తీరును పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఏర్పడి రెండేళ్లు పూర్తి అయ్యింది. జిల్లా కేంద్రం నుంచి అంబాజీపేట స్టాక్ పాయింట్ సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికి ఉన్నతాధికారులు అవినీతిని గుర్తించకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారం ఎప్పటి నుంచి కొనసాగుతుంది.. ఇందులో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల హస్తం ఉందా అనే కోణాల్లో విచారణ చేపట్టాల్సి ఉంది. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ అధికారుల దర్యాప్తునకు ఆదేశించి నివేదికను తీసుకున్నట్లు సమాచారం.

గ్రీవెన్స్‌కు 220 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

అమలాపురం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల ఫిర్యాదులన్నీ నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి అనుసంధానం చేయబడతాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీ కోసం ఫిర్యాదులను హెల్ప్‌లైన్ ద్వారా సీఎం కార్యాలయానికి చేరతాయన్నారు. ప్రజా పరిపాలనలో గ్రీవెన్స్ చాలా కీలక పాత్ర పోషిస్తుందని, వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం మీ కోసం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో వి.మదన్మోహనరావు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణిలు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 220 అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను సావధానంగా విని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్ర స్థాయి అధికారులను సమన్వయం చేసుకుని అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కార మార్గాలు చూపాలన్నారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీల నమోదు, పరిష్కార తీరు తెన్నుల సరళిని ఆన్‌లైన్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పరిశీలించి సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సీపీవో వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, డ్రైన్స్ కార్యనిర్వాహక ఇంజనీర్ ఎంవీవీ కిశోర్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి, డీపీఆర్వో కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు గంటల్లో ముంబాయి

రాజమహేంద్రవరం నుంచి ఎయిర్‌బస్‌లు



వార్త..7లో

'ఆశ'ల ఆగ్రహం



కలెక్టరేట్ ముట్టడికి యత్నిస్తున్న ఆశ కార్యకర్తలు

కలెక్టరేట్ ముట్టడిలో ఉద్రిక్తత

తోపులాట..వాగ్వాదం..

అమలాపురం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సోమవారం ఓ వైపు నిరసనలు.. మరోవైపు ధర్నాలతో దద్దరిల్లింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వివిధ వర్గాల ప్రజలు, రైతులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన తెలిపారు. వందలాది మంది ఆశ వర్కర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి స్పష్టమైన హామీ కోసం కలెక్టరేట్‌ను ముట్టడించారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది అప్రమత్తమై వారిని అడ్డుకున్నారు. ఆశ వర్కర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పీహెచ్‌సీల్లోనే ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది ఆశ కార్యకర్తలు తరలివచ్చి ధర్నాకు దిగారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో వైద్య ఆరోగ్యశాఖ అధికారుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్తేరు రాణి అధ్యక్షతన జరిగిన ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి జిల్లాశాఖ గౌరవాధ్యక్షురాలు కె.కృష్ణవేణి, జిల్లా ప్రధాన కార్యదర్శి మలక సుభాషిణి, సీఐటీయూ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడారు. ధర్నా శిబిరం వద్దకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంతకూ డీఎంహెచ్‌వో శిబిరం వద్దకు రాకపోవడంతో ఆగ్రహించిన ఆశ కార్యకర్తలు కలెక్టరేట్‌లోకి దూసుకువెళ్లే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపు చేశారు. కొద్దిసేపు పోలీసులతో తోపులాట జరిగింది. సర్క్యులర్‌ను వెనుక్కు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆశ కార్యకర్తలు ధర్నాను ఉపసంహరించారు. కార్యక్రమంలో ఉమాదేవి, సీత, మంగాదేవి, వెంకటలక్ష్మి, పద్మ, జి.బేబి, ఇందిర పాల్గొన్నారు.



పోలీసులు అడ్డుకోవడంతో నినాదాలు చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఎస్సీ వర్గీకరణ కమిటీ ఏర్పాటుపై ఆందోళన

కులగణన జరపకుండా ఎస్సీ వర్గీకరణ కమిటీని వేయడాన్ని నిరసిస్తూ రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల మాలల న్యాయ పోరాట సమితి జేఏసీ నాయకులు ధర్నా నిర్వహించారు. కులగణన జరిపిన తర్వాతే వర్గీకరణ కమిటీ వేయాలంటూ నినాదాలు చేశారు. ఇసుకపట్ల రఘుబాబు, కోట రామ్మోహనరావు, జంగా బాబూరావు, రేవు తిరుపతిరావు, జేఏసీ నాయకులు బత్తుల మురళీకృష్ణ, బొంతు మణిరాజు, సరెళ్ల విజయప్రసాద్, గెడ్డం తులసీభాస్కర్, తోటే ప్రతాప్, బళ్ల నోబుల్, తాడి సహదేవ్, మందపాటి మధు పాల్గొని కలెక్టర్‌కు అర్జీ అందించారు. అలాగే రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ సాకుతో డీఎస్సీ నోటిఫికేషన్‌ను జాప్యం చేయడాన్ని నిరసిస్తూ మాలమహానాడు జిల్లాశాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు జంగా బాబూరావు, పేరి చిట్టిబాబు, జల్లి శ్రీనివాస్, పెయ్యల పరశురాముడు, గెద్దాడ బుద్ధరాజు, గూటం సాయి, ఉబ్బన శ్రీను, నాతి శ్రీనివాసరావు, పోతుమూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాలల న్యాయపోరాట సమితి నాయకుల నిరసన

రైతుల ఆవేదన

2023 డిసెంబరు 6న సంభవించిన మిచాంగ్ తుఫాన్‌తో పంట నష్టపోగా అన్ని మండలాల రైతులకు ప్రభుత్వం పరిహారం అందించింది. ఒక్క అమలాపురం రూరల్ మండల రైతులకు ఏ ఒక్కరికీ ఇంత వరకు నష్టపరిహారం చెల్లించలేదు. ఆరు నెలలుగా అధికారుల చుట్టూ అర్జీలు అందిస్తున్నాం. కేవలం వ్యవసాయంపైనే ఆధారపడి ప్రకృతి విపత్తులతో నష్టపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తుఫాన్ నష్టపరిహారం చెల్లించాలని వేడుకుంటూ కలెక్టరేట్ ఎదుట రైతులు ఉప్పుగంటి భాస్కరరావు, అప్పారి వెంకటరమణ, బి.దుర్గాప్రసాద్, పాటి కృష్ణ, అప్పారి రాంబాబు, కర్రి చంటి, లంక వరలక్ష్మి ధర్నా నిర్వహించారు.



పరిహారం కోసం రైతుల నినాదాలు

108 సిబ్బంది ధర్నా


అరబిందో సంస్థ చెల్లించాల్సిన వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట 108 అంబులెన్సు సిబ్బంది ధర్నా నిర్వహించారు. 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ప్రతీ నెల 5వ తేదీన వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని నినాదాలు చేశారు.



సదుపాయాల గుర్తింపునకు చెక్‌లిస్ట్

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను చెక్‌లిస్టు ఆధారంగా గుర్తించి వారం రోజుల్లో నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సంబంధిత ప్రత్యేక అధికారులు, ఇంజనీర్లను ఆదేశించారు. 84 ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, చైల్డ్‌కేర్ సెంటర్లలో ఉన్న మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం తదితర సమస్యలను గుర్తించేందుకు ఒక్కో వసతిగృహానికి ప్రత్యేక అధికారితో పాటు ఇంజనీర్‌ను నియమించామన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, మరమ్మతులు, మెనూ అమలులో లోపాలు వంటి వాటిని చెక్‌లిస్టు ఆధారంగా గుర్తించాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో 500కు పైగా ఉద్యోగులు ఉంటే కార్యనిర్వాహక ఇంజనీర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించి చెక్ లిస్టు ఆధారంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. చిల్డ్రన్ కేర్ సెంటర్‌కు 21 మంది ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో పాటు ప్రత్యేక అధికారులు, ఇంజనీర్లు తనిఖీలు నిర్వహిస్తారన్నారు. చెక్‌లిస్టు ఆధారంగా గుర్తించిన సమస్యలన్నింటినీ క్రోడీకరించి అంచనాలు రూపొందించాలని సూచించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత, ఇతర నిధులతో ఆయా పనులను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రన్నింగ్ వాటర్‌తో మరుగుదొడ్లు, కిచెన్ సమస్యలు, మెనూ నాణ్యత వంటి వాటితో దోమతెరలు, శ్లాబ్ లీకేజీలు, పైపులైన్లు, ఫ్యాన్లు, లైట్లు వంటి ఇతర అంశాలను కూడా గుర్తించి ఈ నెల 23నాటికి నివేదిక అందించాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ సంక్షేమ వసతిగృహాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, మెరుగైన ఫలితాలు సాధించేందుకు సంక్షేమ శాఖ అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. నాణ్యమైన విద్యాబోధన అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో వి.మదన్‌మోహనరావు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, డీపీవో డి.శాంతలక్ష్మి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్‌తో పాటు అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.



దేదీప్యమానం

రాజమహేంద్రవరం కోటిలింగాల క్షేత్రంలో సోమవారం సాయంత్రం లక్ష దీపోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

వార్త..6లో


తొండంగిలో సద్యోజాత శివాలయం



శంకరా.. అర్ధనారీశ్వరా..

తొండంగిలో అరుదైన సద్యోజాత శివాలయం

తొండంగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దర్శనం చేసుకుంటేనే తక్షణ ఫలితాన్ని అనుగ్రహించే అరుదైన సద్యోజాత శివాలయంగా పేరొందింది. రాజరాజేశ్వరి సహిత రామలింగేశ్వరుడి నిలయంగా కొలువైన ఈ ఆలయం కాకినాడ జిల్లా తొండంగి మండల కేంద్రంలో ఉంది. అన్ని శివాలయాలకంటే అత్యంత విశిష్టమైన శివాలయం పశ్చిమాభిముఖ శివాలయమని శైవాగమం పేర్కొంది. ఇటువంటి ఆలయాన్ని సందర్శిస్తే మరుక్షణం ఉత్తమ ఫలితాన్ని అందిస్తుందని, ఎక్కడైనా తారసపడితే తప్పక దర్శించి స్వామి అనుగ్రహం పొందాలని చెబుతోంది. తొండంగిలో ఉన్న రామలింగేశ్వరుడు పశ్చిమాభిముఖుడై సద్యోజాత ముఖంతో భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ఈ ఆలయం అనేక విశిష్టతలకు నెలవై ఉంది. స్వామి లింగం అర్ధనారీశ్వర తత్వానికి ప్రతీకగా నిలిచింది. శివలింగం సగభాగం గౌర వర్ణంతో అమ్మవారికి ప్రతీకగా నిలుస్తోంది. ఆలయానికి పశ్చిమాన స్వామికి నిలయంగా చెప్పే రుద్రభూమి ఉంది. అమ్మవారు రాజరాజేశ్వరిగా కొలువై ఉన్నారు. ఉత్తరాన కోనేరు ఉంది. ఆలయ ప్రాంగణంలో సీతారాములు, చండీశ్వరుడు, వినాయకుడు, కాలభైరవుడు, అష్టలక్ష్ములు నవగ్రహాలు పరివార దేవతలుగా కొలువై ఉన్నారు.ఈ ఆలయాన్ని బ్రిటీష్ కాలంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసి



స్వామి అనుగ్రంతో పదోన్నతి పొందిన డబ్బీరు వెంకట రమణయ్యపంతులు జీర్ణోద్ధరణ చేసినట్టు చెబుతారు. తదనంతరం 2004లో గ్రామస్తులు మరోమారు ఆలయ జీర్ణోద్ధరణ జరిపారు. ప్రస్తుతం ఈ శివాలయాన్ని అన్నవరం ఆలయం దత్తత తీసుకుంది. అనేక విశిష్టతలుగల ఈ ఆలయానికి కార్తీక మాసంలో అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుంటారు. పౌర్ణమి రోజున స్వామి తెప్పోత్సవం ఘనంగా నిర్వహిస్తారు.


పౌర్ణమి రోజున తెప్పోత్సవం

ఈ ఆలయానికి.. 1132 ఏళ్లు!


బిక్కవోలులోని త్రిలింగక్షేత్రం

చరిత్రకు సాక్ష్యం ఏంటి.. తూర్పుచాళుక్యులు అంటారు.. మొగలులు.. బాబర్ అంటారు.. ఇలా చరిత్రలో ఎంతో మంది రాజుల పేర్లు వినబడుతుంటాయి.. అయితే ఆనాటి రాజదర్పానికి నిదర్శనమైన కోటలు కనుమరుగయ్యాయి.. చరిత్రలో కలిసిపో యా యి.. అయితే వారు నిర్మించిన ఆలయాలు మాత్రం నేటికీ ఆ రాజుల దర్పానికి నిదర్శనంగా కనిపిస్తూనే ఉంటాయి. అటువంటి ఆలయాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నో ఉన్నాయి. వాటిలో ఒకటి.. నాడు తూర్పుచాళుక్యులు రాజ్యంలో ఉన్న త్రిలింగ క్షేత్రం బిక్కవోలు.. ఆ ఆలయం ఎప్పుడు నిర్మించారో తెలుసా..క్రీ.శ 849 - 892 సంవత్సరాల మధ్య... అంటే నేటికి 1132 సంవత్సరాలు అవుతోంది. అయినా నేటికీ చెక్కుచెదరలేదు.అపురూప శిల్పకళ భక్తులను అబ్బురపరుస్తోంది.. కార్తీక మాసంలో ఒక్కసారి ఆ ఆలయానికి వెళ్లాల్సిందే.. స్వామి దర్శనం చేసుకుని..ఆ ఆలయంలో సేదతీరాల్సిందే..



- చరిత్రకు సాక్ష్యం.. త్రిలింగ క్షేత్రం
- తూర్పు చాళుక్యుల నిర్మాణం
- ఆకట్టుకుంటున్న ఆలయ శిల్పకళ
- నాడు బిరుదాంకినవోలు..
- నేడు బిక్కవోలుగా ప్రసిద్ధి

బిక్కవోలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మన దేశంలోని ప్రాచీన దేవాలయాలుగా గుర్తించిన వాటిలో ఆరు దేవాలయాలు తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామంలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. సుమారు 1100 ఏళ్ల కిందటే అనేక దేవతా మూర్తులు, పకృతి దృశ్యాలు మనోహరంగా మలచబడి దశాబ్దాలుగా ఎన్నో విపత్తులను, దాడులను తట్టుకుని ఇప్పటికే చెక్కు చెదరకుండా ఉన్నాయి. రాజమహేంద్రవరం-కాకినాడ పట్టణాల మధ్య పవిత్ర గోదావరి కాలువ చెంతనే ఉన్న బిక్కవోలు గ్రామాన్ని తూర్పుచాళుక్యులు క్రీ.శ 849 - 892 సంవత్సరాల మధ్య బిరుదాంకినవోలు పేరుతో రాజధానిగా చేసుకుని పరిపాలించారు. ఆ సమయంలోనే వారు పలు దేవాలయాలు నిర్మించారు. వాటిలోనివే బిక్కవోలులోని ఆరు దేవాలయాలు. గ్రామంలో ఉన్న ఈ ఆరు దేవాలయాల్లో ఐదు శివాలయాలే. వీటిలో గోలింగేశ్వర, రాజరాజేశ్వర, చంద్రశేఖర దేవాలయాలు గ్రామం మధ్యలో ఒకే ప్రాంగణంలో ఉండి భక్తుల పూజాధికాలతో నేటికి అలరారుతున్నాయి. గోలింగేశ్వరస్వామి గర్భగుడి లోపల ప్రధాన ద్వారబంధంపై ఉన్న తెలుగు అక్షరాల లిపి వెయ్యేళ్ల కాలం నాటిదని చరిత్రకారుల అభిప్రాయం. స్వామివారిని తదేకంగా చూస్తున్న నంది విగ్రహం కూడ ప్రాచీనమైనదే. ఇక్కడ ధ్వజస్తంభాన్ని ఆనుకుని ఉన్న కౌమారి విగ్రహం వద్ద భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తుంటారు.ప్రాచీన దేవాలయాలకే కాక ప్రతి యేటా ఎంతో వైభవంగా నిర్వహించే శ్రీకుమాసుబ్రహ్మణ్య షష్టి ఉత్సవాలతో బిక్కవోలు గ్రామం రాష్ట్ర ఖ్యాతి గడించింది.బిక్కవోలు ప్రాచీన దేవాలయాల విశిష్టతను మూడొందల పేజీలతో అరవై ఛాయా చిత్రాలతో సచిత్రంగా..దిటెంపుల్ ఆఫ్ బిక్కవోలు.. అనే గ్రంధం పేరుతో ఆంధ్రా విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ ఎస్.నాగేశ్వరరావు అందించారు. లక్షలాది ప్రాచీన కళాప్రియులకు నాగేశ్వరరావు అందించిన గ్రంధం గొప్ప వరమని చెప్పకతప్పదు.





కేదారేశ్వరస్వామి ఆలయం

గ్రామంలో జైన్ దేవాలయం

గ్రామంలో వేర్వేరు చోట్ల ఉన్న మరో మూడు దేవాలయాలు జీర్ణ దేవాలయాలుగా మారాయి. ఉన్నత పాఠశాల సమీప పంట పొలాల్లో ఉన్న దేవాలయాన్ని జైన దేవాలయంగా భావిస్తున్నారు. ఎటువంటి విగ్రహం లేకుండా పీఠం మాత్రమే ఉన్న ఈప్రాచీన గుడిని కంచరగుడి అని పిలుస్తారు. ఈ ఆలయ నిర్మాణం పూర్తిగా జైన సంప్రదాయ రీతిలో కొనసాగిందని చెప్పవచ్చు. రాష్ట్రకూటుల సాంస్కృతిక రాజధాని అయిన ఎల్లోరా గుహల్లో చివరిది జైన్ గుహలోని శిల్పకళారీతినే బిక్కవోలు దేవాలయం పోలి ఉంది. నలుపలకలుగా చెక్కిన రాళ్లను సున్నం వాడకుండా కేవలం గురుత్వాకర్షణ శక్తి, అనుపేక్షణీయతా సూత్రంతో ఒక రాయిపై రాయిని పేర్చి దేవాలయాలను నిర్మించారు. సుమారు వందేళ్ల కిందట ఈగుడి నుంచి తీసుకెళ్లిన వర్ధమాన మహావీరుడి ప్రతిమను చెన్నై మ్యూజియంలోని జైన గ్యాలరీలో ఉంచారు. 2006 సెప్టెంబరులో స్థానికుడొకరు ఈ ఆలయానికి దగ్గరల్లో గృహనిర్మాణం నిమిత్తం త్వకాలు జరుపుతుండగా ధ్యానముద్రలో వున్న మహావీరుడి శిల బయల్పడింది. ఇదే ఆలయ ద్వారబంధంపై ఉన్న లక్ష్మీదేవి శిలారూపం చెన్నై మ్యూజియంలోని గుణగవిజయాదిత్యుడి రాజముద్రపై వున్న లక్ష్మీదేవి రూపాన్ని పోలి ఉండడం గమనార్హం. ఈ ఆధారాలతోనే దేవాలయాన్ని జైన దేవాలయంగా భావిస్తున్నారు.


పొలాల మధ్య నేటికీ తెరుచుకోకుండా పాడుబడి ఉన్నజైన్ దేవాలయం


నక్కల గుడి

జవ్వలదొడ్డిలో నక్కల గుడి

బిక్కవోలు నుంచి ఊలపల్లి వెళ్లే మార్గంలో మరో ప్రాచీన వీరభద్రుడి ఆలయం ఉంది. ఇటీవల కేదారేశ్వరస్వామిగా కొలుస్తూ శివరాత్రి పర్వదినాన పూజాధికాలు గావిస్తున్నారు. ఈ ఆలయానికి దక్షిణం వైపు ఊలపల్లి రోడ్డు ఉండడంతో వీధిశూల తగలకుండా ఈ ఆలయంపై వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. తూర్పు చాళుక్యుల కాలంలో శిల్పకళకు, వాస్తుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నది ఇందుకు నిదర్శనం. జువ్వలదొడ్డిలో ఉన్న ప్రాచీన ఆలయాన్ని నక్కల గుడిగా పిలుస్తున్నారు. బిక్కవోలు నడిబొడ్డున ఉన్న గోలింగేశ్వర ఆలయంలో గోలింగేశ్వరస్వామితో పాటు సర్వాలంకార భూషితమైన పార్వతిదేవి, విఘ్నాలు తొలగించే వినాయకుడు, భద్రకాళి సమేత వీరభద్రుడు, సహజ పుట్టతో దర్శనమిచ్చే శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఒకే ప్రాకారంలో ఉండి నిత్య పూజలందుకుంటూ నేటికీ భక్తులకు దర్శనమిస్తున్నారు.తూర్పు చాళుక్యుల సృజనాత్మకతకు ప్రతీకగా నిలుస్తూ ఉన్నత పాఠశాల దగ్గర కొలువై ఉన్న పదకొండు అడుగుల ఏకశిలా భారీ లక్ష్మీ గణపతి విగ్రహం భక్తుల పూజలతో అలరారుతూ ప్రసిద్ధపుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది.


రాజమహేంద్రవరం కోటిలింగాలఘాట్‌లో దేదీప్యమానంగా లక్ష దీపోత్సవం

కార్తీక దీపాల సంబరం

- రాజమహేంద్రవర కోటిలింగాల క్షేత్రంలో లక్ష దీపోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కోటిలింగాల క్షేత్రంలో లక్ష దీపోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. పవిత్ర కార్తీక మాసంలో సోమవారం సాయంత్రం లక్ష దీపోత్సవం దీప కాంతులతో వెలుగులీనింది. ఉమాకోటిలింగేశ్వర స్వామి దేవస్థానం, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 12వ లక్ష దీపోత్సవం వైభవోపేతంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు హాజరయ్యారు. ప్రత్యేకఅతిథులుగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, వీరరాఘవమ్మ, టీడీపీ ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, వైసీపీ నేతలు జక్కంపూడి విజయలక్ష్మి, భరత్, షర్మిలారెడ్డి పాల్గొన్నారు. ఆధ్యాత్మిక చింతనతో కార్తీక దీపాలు వెలిగించి హారతులిచ్చారు. కోటిలింగాలరేవులో మెట్లపై ఏర్పాట్లు చేసిన మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి పూజలుచేశారు. కోటిలింగాలక్షేత్రం భక్తజనసంద్రంగా మారింది. అతిథులకు కొండలరావు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ప్రధాన ఆలయాలు కార్తీక సోమవారం సందర్భంగా కళకళలాడాయి. కరప మండలం వాకాడలో దీపాల సంబరం ఆకట్టుకుంది.


రాజమహేంద్రవరంలో హారతి ఇచ్చి లక్ష దీపోత్సవం ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి


పిఠాపురం పాదగయ పుష్కరిణిలో తెల్లవారుజామున దీపాలు వదులుతున్న భక్తులు


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు


సామర్లకోట భీమేశ్వరాలయంలో దీపాలతో శివలింగం


భక్తులతో రద్దీగా ఉన్న సామర్లకోట భీమేశ్వరాలయం


రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌వద్ద తెల్లవారుజామున భక్తుల పుణ్యస్నానాలు


కరప మండలం వాకాడ సంబరంలో వెలిగించిన కోటి దీపాలు


నామినేషన్లు అందజేస్తున్న నామన వెంకటలక్ష్మి, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్, అహమద్ షేక్

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు..

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

- చివరిరోజు4 నామినేషన్ల దాఖలు
- మొత్తం ఆరుకు చేరిన నామినేషన్లు
- నేడు పరిశీలన
- ఈనెల 21వరకు ఉపసంహరణలు
- వచ్చేనెల 5న పోలింగ్
- 9న కౌంటింగ్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీఎన్నికలకు సంబంధించి సోమవారం ఒక్క రోజే నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వీరు నలుగురు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు సమర్పించారు. కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన నామన వెంకటలక్ష్మి, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కవల నాగేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన పులుగు దీపక్, మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన అహ్మద్‌షేక్ నామినేషన్లను సహాయ రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా డీఆర్వో వెంక్రటావుకు అందజేశారు. ఈనెల 11వతేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా తొలుత బొర్రా గోపిమూర్తి, తర్వాత గంథం నారాయణరావు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో చివరిరోజైన సోమవారానికి నామినేషన్ల సంఖ్య ఆరుకు చేరుకుంది. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ల పరిశీలన క్రతువు జరుగుతుంది. ఈనెల 21వతేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ నిర్వహిస్తున్నారు. వచ్చేనెల 5న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. ఎన్నికల పోలింగ్‌కోసం ఆరుజిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12, తూర్పుగోదావరి జిల్లాలో 20, ఏలూరు జిల్లాలో 20, కాకినాడ జిల్లాలో 22, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22, పశ్చిమగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తంగా 16,316మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614 మంది ఓటర్లు, తూర్పుగోదావరి జిల్లాలో 2893, ఏలూరు జిల్లాలో 2605, కాకినాడ జిల్లాలో 3333, కోనసీమ జిల్లాలో 3209, పశ్చిమగోదావరి జిల్లాలో 3662 మంది ఓటర్లు ఉన్నారు. వచ్చేనెల 9న కౌంటింగ్ జరగనుంది. అదేరోజు ఎన్నికల ఫలితాలను వెల్లడించనున్నారు.

ప్రస్తుతానికి బరిలో ఆరుగురు

నామినేషన్లస్వీకరణ గడువు ముగియడంతో ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుతానికి ఎన్నికల బరిలో ఆరుగురు అభ్యర్థులు ఉన్నారు. ఈనెల 21న ఉపసంహరణల తర్వాత బరిలో ఎవరు నిలుస్తారో లెక్క తేలనుంది.

సత్యదేవుని సన్నిధిలో భక్తుల రద్దీ

- రూ.75లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో కార్తీక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని రద్దీ నెలకొంది. అధికారులు వేకువజామున 2గంటలనుంచి వ్రతాలు, 3గంటలనుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఒక్కరోజు 9028 జంటలు స్వామివారి వ్రతాలు ఆచరించగా వివిధ విభాగాల ద్వారా రూ.75లక్షల ఆదాయం లభించింది. 70వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అధికారులు తీసుకున్న చర్యలతో ఆలయ ప్రాంగణంలో ఎంతమంది భక్తులు వస్తున్నా రద్దీ కనబడకపోవడం విశేషం.


వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

మూడు గంటలపాటు నరకయాతన

- ఆగిఉన్న లారీని ఢీకొన్న పాల వ్యాన్
- క్యాబిన్‌లో ఇరుక్కొన్న వ్యాన్ డ్రైవర్
- క్రేన్ సహాయంతో బయటకు..
- కాకినాడ జిల్లా తుని హైవేపై ఘటన


క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను స్టీరింగ్ తొలగించి బయటకు లాగుతున్న దృశ్యం

తుని రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో హైవేపై రాజుల కొత్తూరు సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఓ పాల వ్యాన్ డ్రైవర్ ఆగిఉన్న లారీని ఢీకొన్నాడు. లారీ వెనుకభాగంలో క్యాబిన్ ఉండిపోయింది. దీంతో డ్రైవర్ అందులో ఇరుక్కుపోయాడు. పెట్రోలింగ్ సిబ్బంది క్రేన్ సహాయంతో అతడ్ని మూడు గంటల తర్వాత బయటకు తీయగలిగారు. దీనికి సంబంధించిన వివరాలివి..

అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన ఎల్.శ్రీను పాలవ్యాన్ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అతడు విశాఖపట్నం నుంచి కత్తిపూడి వైపు పాల వ్యాన్‌తో వస్తున్నాడు. తుని హైవేపై రాజుల కొత్తూరు సమీపంలోకి వచ్చేసరికి నిద్ర మత్తులో ఆగిఉన్న లారీని వెనుకనుంచి బలంగా ఢీకొట్టాడు. ప్రమాద తీవ్రతతో వ్యాన్ నుజ్జునుజ్జు అవ్వగా డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా అటుగా వెళ్తున్న వాహనదారులుఅతడ్ని రక్షించేందుకు ప్రయత్నించినా బయటకి తీయలేకపోయారు. దీంతో పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది క్రేన్ సహాయంతో బయటకు తీశారు. మూడు గంటలపాటు మృత్యువుతో పోరాడిన శ్రీనును అంబులెన్స్‌లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. తుని పోలీసులు కేసు నమోదు చేశారు.


అచ్చుగుద్దినట్టు.. అచ్చుగుద్దినట్టుగా పైన కింద.. ఒకేలా ఉన్న ఈ చిత్రం.. కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని తూరంగేశ్వరస్వామి ఆలయం కోనేరు వద్ద ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్‌మనిపించింది.. -ఫొటోగ్రాఫర్, కాకినాడ

2 గంటల్లోనే ముంబయి పయనం

- రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్ ఆక్యుపెన్సీ పెంపు
- డిసెంబరు 1 నుంచి ముంబయికి..
- 12 నుంచి ఢిల్లీకి విమాన సర్వీసులు
- 180 సీటింగ్‌తో విమానాల రాకపోకలు

రాజమహేంద్రవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం విమానాశ్రయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఇక్కడి నుంచే దేశవ్యాప్త రాకపోకలకు సన్నద్ధం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజమహేంద్రవరం విమానాశ్రయ అభివృద్ధికి రూ.250కోట్లు కేటాయించారు. దీంతో విమానాశ్రయ రూపురేఖలే మారిపోనున్నాయి. పనులు పూర్తయ్యేలోపు రాకపోకలను పెంచే యోచనలో ఉన్నారు. ఎక్కడికైనా ఇక్కడి నుంచి వెళ్లేలా విమానాశ్రయాన్ని సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటివరకూ 72 సీట్లతో విమానాలు నడుస్తున్నాయి. ఇక డిసెంబరు 1 నుంచి 180 సీట్లు ఉన్న ఎయిర్‌బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. ఇప్పటికే టికెట్లు విక్రయిస్తున్నారు. 1వతేదీ నుంచి రాజమహేంద్రవరం టు ముంబయికి 180 సీట్లతో రోజుకు రెండు ఇండిగో ఎయిర్‌బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. అదే నెల 12వ తేదీనుంచి ఢిల్లీకి రెండు ఇండిగో ఎయిర్‌బస్సులు అటూ తిరుగుతాయి. 1వ తేదీ సాయంత్రం 4.50కి ముంబాయి నుంచి బయలుదేరి 6.45గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుంది. రాజమహేంద్రవరంలో రాత్రి 7.15గంటలకు ఎయిర్‌బస్సు బయలుదేరి రాత్రి 9.50 గంటలకు ముంబయి ఎయిర్‌పోర్టుకు చేరుతుంది. మొత్తం జర్నీ సమయం 2.10 గంటలు. మరో ఎయిర్‌బస్ డిసెంబరు 12న ఢిల్లీలో ఉదయం 7.30 గంటలకు బయలుదేరి 9.45 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటుంది. రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టులో ఉదయం 10.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం ఒంటిగంటకు ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుతుంది. ఈ రెండు ఎయిర్ బస్సుల్లో 180మంది చొప్పున ప్రయాణికులు వెళ్లవచ్చు. ఇప్పటివరకూ రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు రోజూ అటూఇటూ 14 సర్వీసులు తిరుగుతున్నాయి. బెంగళూరుకు అటూ 4 సర్వీసులు ఉన్నాయి. చెన్నైకు ఒకసారి వెళ్లి వస్తోంది. గతంలో విశాఖనుంచి సర్వీసు ఉండేది. కానీ రోడ్డు మార్గాన 3గంటల్లో వచ్చేస్తుండడంతో ఎక్కువ మంది విమానం ఎక్కడానికి ఇష్టపడడంలేదు. దీంతో అది రద్దయింది. విమాన ప్రయాణికులు పెరిగితే అక్కడినుంచి కూడా మొదలవుతాయి. ఇక విజయవాడ, తిరుపతి ప్రయాణాలకు కొంత సమయం పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

24 గంటలు సర్వీసుకు అనుకూలం

-ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు

రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి రాత్రీ పగలూ మొత్తం 24 గంటలూ విమాన రాకపోకలు సాగించడానికి అనుకూలమైన సౌకర్యాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రయాణికుల ఆక్యుపెన్సీ బాగుంది. రోజుకు సగటున 1400 మంది రాకపోకలు సాగిస్తున్నారు. నైట్ ల్యాండింగ్ కూడా ఉంది. ప్రధానమంత్రి ప్రయాణించే బోయింగ్ 777 వంటి పెద్ద విమానాలు ఇక్కడినుంచి రాకపోకలు సాగించవచ్చు. ప్రస్తుతం ఉన్న టెర్మినల్‌ను మరో 4 రెట్లు విస్తరిస్తున్నారు.

'జయలక్ష్మి' బాధితులకు.. ఊరట!



- ఆర్థిక భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలకు శ్రీకారం
- పాత చైర్మన్, వైస్ చైర్మన్‌కు చెందిన 11 ఆస్తుల సీజ్‌కి ఉత్తర్వుల జారీ
- సేల్ ఆర్డర్ కోసం ఎదురుచూపులు

సర్పవరంజంక్షన్,నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కోట్లాది డిపాజిట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ పాత చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ఆస్తుల సీజ్ చేసి బాధితులకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. ఆర్థిక మోసానికి పాల్పడిన చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులుకు చెందిన ఎస్.అన్నవరంలో ఉన్న సర్వేనెంబర్ 101, వైస్‌చైర్మన్ విశాలాక్షి పేరుతో బెండపూడిలో సర్వే నెంబర్‌లో 113/4లో ఉన్న 11 ఆస్తులకు చెందిన 1968.83 చ.గజాల స్థలాలను సీజ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేసింది. వీరిద్దరి నిందితులతో పాటు డైరెక్టర్లు, రుణాలు తీసుకున్న వారికి చెందిన 84 ఆస్తులను సీఐడీ సీజ్ చేయడం, వీటిని ట్రిబ్యునల్ కోర్టులో వేయడంతో ప్రస్తుతం వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. జయలక్ష్మి ఆర్థిక మోసం వ్యవహారంలో నిందితులకు చెందిన 95 ఆస్తులను సీజ్ చేసినట్లు అయింది. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసుకు చెందిన వ్యవహారంపై కదలిక రావడంతో రాబోయే నెలరోజుల్లో మరికొన్ని ఆస్తులను సీఐడీ ద్వారా సీజ్ చేయించే దిశగా అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. సత్వరంగా ఆస్తుల సీజ్ ప్రక్రియ, కోర్టులో వాదోపవాదాలు జరిగి సేల్ ఆర్డర్ ప్రక్రియ జరిగితే బాధితులకు ప్రభుత్వం మేలు చేసినట్లు అవుతుందని బాధితులు పేర్కొంటున్నారు.

రూ.520కోట్లు స్వాహా

కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ ప్రధాన కేంద్రంగా ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖ జిల్లాల్లో 29 బ్రాంచీల ద్వారా 19వేలమందినుంచి రూ.520కోట్లు డిపాజిట్లు సేకరించారు. ఇందులో 2,245మంది సభ్యులకు రూ.455.78కోట్లు వరకు రుణాలు ఇచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు. సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, భార్య వైస్‌చైర్మన్ రాయవరపు విశాలాక్షి డిపాజిటర్లకు గడువు ముగిసినా అసలుతోపాటు వడ్డీ చెల్లించకపోవడంతో బాధితులు ఆందోళనకు గురై స్పందనలో 2022, ఏప్రిల్ నెలలో ఫిర్యాదు చేశారు. ఆందోళనకు గురైన డిపాజిటర్లు పలుచోట్ల వివిధ పోలీస్‌స్టేషన్లలో సొసైటీ చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లపై ఫిర్యాదు చేయడంతో వీరిపై పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. జిల్లా సహకారశాఖ, సీబీసీఐడీ అధికారులు విచారణ పూర్తి చేసి రూ.582 కోట్ల మేర ఆర్థికమోసానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు 348 పేజీల నివేదికను ప్రభుత్వానికి అందించారు. ఈ ఆర్థిక కుంభకోణానికి ప్రధాన సూత్రదారులుగా జయలక్ష్మి సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామంజనేయులు, వైస్ చైర్మన్ రాయవరపు బదరీ విశాలాక్షి, కుమారుడు డైరెక్టర్ ఇతర డైరెక్టర్లు రాయవరపుజయమణి, చక్రభాస్కరరావు, ప్రబల మల్లిఖార్జునరావు, మంగళంపల్లి వెంకట సుబహ్మణ్య కుమార్, వారణాసి శాంతేశ్వరరావు, దూళ్ల శ్రీనివాస్, ఆర్.నాగేశ్వరరావు, జయశంకర్‌లుగా నిర్ధారించారు. నివేదిక ఆధారంగా సీబీసీఐడీ చైర్మన్ సీతారామాంజనేయులు, వైస్ చైర్మన్ల విశాలాక్షి, ఐదుగురు డైరెక్టర్లను అరెస్ట్ చేశారు. మిగతా ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

నిందితుల ఆస్తులపై కోర్టులో వాదనలు

ఆర్థిక కుంభకోణం కేసులో బాధ్యులైన సొసైటీ చైర్మన్, డైరెక్టర్లకు చెందిన ఏడాదిన్నర క్రితం 64 ఆస్తులు ఒకసారి, 20 ఆస్తులు మరోసారి సీఐడీ సీజ్ చేయడం, వీటిని ట్రిబ్యునల్ కోర్టులో వేశారు. ఈ ఆస్తుల వ్యవహారంపై కోర్టులో ఆర్గుమెంట్లు కొనసాగుతున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈనెల 14న చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులుకు చెందిన ఎస్.అన్నవరంలో సర్వే నెంబర్ 101, వైస్ చైర్మన్ విశాలాక్షి పేరుతో బెండపూడిలో సర్వే నెంబర్‌లో 113/4 లో ఉన్న 11 ఆస్తులకు చెందిన 1968.83 చ.గజాల స్థలాలను సీజ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటి ఈ కేసులో నిందితులకు చెందిన 95 ఆస్తులను సీజ్ చేసినట్లు అయింది. సీజ్ చేసిన ఆస్తుల విలువ రూ.250 నుంచి రూ.275 కోట్లు వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

సెక్యూరిటీ వాళ్లు చెల్లించకపోతే..

స్థిరాస్తులను సెక్యూరిటీ పెట్టి రుణాలు తీసుకున్న వారు 10 నుంచి 15 రోజుల్లో రుణాలు చెల్లించాలని సొసైటీ పాలకవర్గ సభ్యులు నోటీసులు జారీ చేశారు. వీరి నుంచి రూ.125కోట్లు రికవరీ కోసం ట్రిబ్యునల్ కోర్టులో కేసు వేశారు. వీరు సత్వరంగా అసలు వడ్డీ కలిపి జమ చేసి రుణాలు క్లియర్ చేయాలని, లేదంటే 2022, మార్చి 31 తర్వాత నుంచి నేటి వరకు వడ్డీ వేసి కోర్టు ద్వారా రికవరీ చేస్తామని పాలవర్గం తెలిపింది.

ఆరు జీవోలు జారీ కావాలి

గంగిరెడ్డి త్రినాథరావు, చైర్మన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 11 ఆస్తులకు చెందిన ఒక జీవో జారీ చేశారు. మిగతా 6 జీవోలు జారీ కావాల్సి ఉంది. సీఐడీ వారు ఇంకా 50 మందిపై క్రిమినల్, సివిల్ కేసులు నమోదు చేయాలి. సత్వరంగా జీవోలు జారీ చేయడం పూర్తయితే ట్రిబ్యునల్ కోర్టులో ఆస్తుల వేలంపై సేల్ ఆర్డర్ జారీ చేసినట్లు జరిగితే బాధితులకు న్యాయం జరుగుతుంది.

నేడు సత్యదేవుడి హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ అన్నారు. విధులు కేటాయించిన సిబ్బంది పాల్గొనాలని ఆదేశించారు.

శివసదన్ కాటేజీకి అడ్వాన్స్ విరాళం

అన్నవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన శివసదన్ కాటేజీకి హైదరాబాద్‌కు చెందిన లింగ శార్దక్ మంగళవారం అడ్వాన్స్ విరాళంగా రూ.2,01,101 ఆన్‌లైన్‌లో పంపినట్లు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ తెలిపారు. ఈ కాటేజీ డోనార్ స్కీం ద్వారా రూ.10లక్షలు చెల్లించాల్సి ఉండగా మిగిలిన మొత్తం త్వరలో పంపుతానని సమాచారమిచ్చారన్నారు.

'అన్నవరం'లో ఉద్యోగుల అంతర్గత బదిలీలు

అన్నవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ సోమవారం ఈవో రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీచేశారు.ఈవో సీసీగా ఉన్న సీహెచ్ సాయిబాబాను సన్నిధి విభాగానికి మార్చి సూపరింటెండెంట్ కంచి మూర్తికి సీసీ బాధ్యతలు అప్పగించారు. పెన్నాడ వెంకటేశ్వరరావును సీఆర్వో విభాగంనుంచి పీఆర్వో విభాగానికి, వేలేటి జగన్నాథాన్ని సన్నిధి విభాగంనుంచి సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయానికి, ఎంవీ గణపతిరావును ఆలయ విభాగానికి కేటాయించారు.

జిల్లా మహిళా కబడ్డీ జట్టు క్రీడాకారులు వీరే

సామర్లకోట,నవంబరు18(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా మహిళల కబడ్డీ క్రీడాకారులు 16మందిని ఎంపిక చేసినట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి, కోశాధికారులు కొండపల్లి శ్రీనువాస్, నిమ్మకాయల కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. వీరిలో 12మంది రైడర్లుగానూ, నలుగురు వెయిటర్లుగాను ఎంపిక చేశామన్నారు. ఎంపికైనవారిలో వెంకటలక్ష్మి, అపరంజిత, అరుణ, ఉమా, మంజుల, పరిమళ, వర్షిత, నాగమణి, అశ్రిక, రేఖ, దీపిక, పూనశ్రీ ప్రవల్లిక, జీవన జ్యోతి, నందిని, భవాని, శివజ్యోతి ఉన్నారు. త్వరలో జరిగే అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్‌లోపాల్గొంటారన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

- సత్తా చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు
- బాలికల విభాగంలో ప్రథమస్థానం, బాలురలో ద్వితీయస్థానం


రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించిన తూర్పుగోదావరి బాలికల జట్టు

కాకినాడఅర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో జరుగుతున్న పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-19 హాకీ చాంపియన్‌షిప్ సోమవారంతో ముగిసింది. హోరాహోరీగా జరిగిన పోటీల్లో వివిధ జిల్లాలనుంచి 450మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు తమ సత్తా చాటారు. బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టు ప్రథమస్థానం సాధించింది. బాలురవిభాగంలో ద్వితీయస్థానం సాధించారు. పోటీల్లో బాలికల్లో అనంతపురం ద్వితీయస్థానం, విశాఖ తృతీయస్థానం సాధించాయి. బాలుర విభాగంలో విశాఖ ప్రథమస్థానం సాధించగా ఉమ్మడి తూర్పు ద్వితీయస్థానం, అనంతపురం తృతీయస్థానం సాధించాయి.

విజేతలకు బహుమతి ప్రదానం

పోటీల్లో గెలిచిన విజేతలకు డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ అధ్యక్షతన బహుమతి ప్రదానం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, జేఎన్టీయూ క్రీడా కార్యదర్శి శ్యామ్‌కుమార్, హాకీ క్రీడాకారుడు దాసరి మురళీకృష్ణ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో గెలుపొందిన వివిధ జిల్లాల క్రీడాకారులను రాష్ట్రస్థాయి జట్లకు ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. కార్యక్రమంలో హాకీ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.రవిరాజు, పీఈటీ సంఘ జిల్లా కార్యదర్శి కె.నూకరాజు, ట్రెజరర్ రవి సుందర్‌కొర్, ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి జి.సునీల్ పాల్గొన్నారు.

తప్పుడు కేసు పెట్టి.. తప్పుడు ప్రచారం

- టీడీపీ నేత, మహాసేన రాజేష్
- నిజనిర్ధారణ చేయాలంటూ కోనసీమ ఎస్పీకి వినతి

అమలాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో 30కి పైగా తప్పుడు కేసులు పెట్టించి వేధింపులకు గురిచేశారని మహాసేన రాజేష్ ఆరోపించారు. తనకు కోర్టులపై పూర్తి నమ్మకం ఉందన్నారు. ఇప్పటికే జగన్ ప్రభుత్వంలో పెట్టిన 15కు పైగా కేసులను కోర్టులు కొట్టి వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటీవలకాలంలో జిల్లానుంచి ఓమహిళ తప్పుడు ఫిర్యాదు చేసిందని దానిపై నిజనిర్ధారణ చేయాలని కోరేందుకు సోమవారం కోనసీమ జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఎస్పీ బి.కృష్ణారావును కలిసి వివరించినట్టు ఆయన తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా జనవరిలో ఏదో జరిగిందని వైసీపీ సానుభూతిపరురాలు నవంబరులో ఫిర్యాదు చేయడంలో మర్మమేమిటో తెలుసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే కేసు పెట్టుకునే అవకాశం ఉన్నా ఎందుకు పెట్టలేదో ఆలోచించాలన్నారు. మహిళ ఫిర్యాదు చేయగానే కొన్నిచానళ్లలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్‌పై కేసునమోదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తనను, తన పార్టీని బద్నామ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. మహిళ ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి నిజనిజాలు వెలికి తీయాలని కోరినట్టు ఆయన తెలిపారు.


అమలాపురం ఎస్పీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న మహాసేన రాజేష్

ప్రాణం తీసిన ఈత సరదా

- కాలువలో స్నానానికి వెళ్లి విద్యార్థి మృతి


పాముల గౌతమ్(ఫైల్)

దేవరపల్లి,నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి కాలువలో స్నానానికి వెళ్లిన విద్యార్థి నీట మునిగి మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. దేవరపల్లి గ్రామానికి చెందిన పాముల వెంకట్రావు, శిరీష దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమారుడు పాముల గౌతమ్(14) స్థానిక ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో స్నేహితులు పోలుమాటి బాలారిషి, మద్దాల దుర్గాప్రసాద్, కనికెళ్ల సిద్దార్థ, కోనాల భరత్, కనికెళ్ల నందులతో కలిసి సాయంత్రం 3గంటలకు దేవరపల్లి జిల్లా పరిషత్ రహదారిలోని పోలవరం కుడి కాలువలో స్నానానికి వెళ్లాడు. గౌతమ్, దుర్గాప్రసాద్ స్నానానికి దిగగా మిగిలిన వారు గట్టుపై ఉన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కాళ్లు అందక గౌతమ్ నీట మునిగిపోయాడు. దుర్గాప్రసాద్‌ను గట్టుపై ఉన్న స్నేహితులు ప్యాంటు, షర్టు ముడివేసి పైకి లాగడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. స్నేహితులు ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయి ఈ విషయాన్ని తల్లిదండ్రులు ఎవరికీ చెప్పలేదు. సాయంత్రమైనా గౌతమ్ ఇంటికి రాకపోవడంతో ఆరా తీయగా స్నేహితులు కలిసి కాలువ స్నానానికి వెళ్లారని స్థానికులు చెప్పారు. దీంతో ఆ వీధిలో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా గౌతమ్ స్నేహితులతో వెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా మిగిలిన స్నేహితులు జరిగిన సంఘటనను వివరించారు. సోమవారం ఉదయం ఘటన ప్రాంతానికి బంధువులు, పోలీసులు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. మునిగిన ప్రాంతం నుంచి 200మీటర్ల దూరంలో రెల్లిగడ్డి దుబ్బిలో మృతదేహం లభించినట్టు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.


పోలవరం కాల్వలో తేలియాడుతున్న మృతదేహం

పొలానికి నీరు పెడుతుండగా విద్యుదాఘాతం

- ముగ్గుళ్లలో వ్యక్తి మృతి

సీతానగరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం ముగ్గుళ్ల గ్రామానికి చెందిన మిరప శ్రీను(56) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సోమవారం ఉదయం అతడు తన పొలానికి నీరు పెట్టుకోవడానికి వెళ్లాడు. పక్కరైతు సరిహద్దుపొలం నుంచి బోదె ద్వారా నీరు ఇతడి పొలంలోకి రావాలి. బోదెద్వారా వచ్చే నీటిని గమనిస్తుండగా విద్యుత్ స్థలం నుంచి 11కేవీవైరు తెగి నీటిలో పడగా శ్రీను షాక్‌కు గురైమృతిచెందాడు. పక్క రైతు మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లగా రెండు కాళ్లు కాలిపోయి విగతజీవిగా ఉన్న శ్రీను కనిపించడంతో మృతుడి కుమారుడు రామారావుకు తెలిపాడు. ఎస్‌ఐ రామ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఏసీబీ వలలో రంగంపేట సర్వేయర్

- రూ.75 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

రంగంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ వలలో రంగంపేట మండల సర్వేయర్ చిక్కాల ధర్మారావు చిక్కాడు. రంగంపేట మండలం ఈలకొలను గ్రామానికి చెందిన బత్తిన రాముడు తన తల్లి బత్తిన సత్యవతి పేరున ఉన్న పొలం వివరాలు తప్పుగా పడ్డాయి. దాన్ని సరి చేయాలని సర్వేయర్ ధర్మారావును కోరగా రూ.75వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇచ్చేందుకు రాముడు ఒప్పందం కుదుర్చుకొని తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సోమవారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేసి ధర్మారావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ దాడిలో ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ భాస్కరరావు, డి.వాసుకృష్ణ, వై.సతీష్ పాల్గొన్నారు.


అధికారులకు చిక్కిన సర్వేయర్ చిక్కాల ధర్మారావు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులుగా హర్షవర్ధన్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా కె.హర్షవర్ధన్‌ను నియమించారు. సోమవారం ఆయన కాకినాడలో కలెక్టర్ షాన్ మోహన్, డీఆర్వో వెంకటరావును కలిశారు.


కాకినాడలో కలెక్టర్ షాన్ మోహన్‌ను కలిసిన హర్షవర్ధన్

ఇనుప కడ్డీల మాటున గంజాయి రవాణా

కొవ్వూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 287 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు గామన్ బ్రిడ్జి టోల్‌గేటు వద్ద సీఐ పి.విశ్వం, ఎస్‌ఐ కె.జగన్మోహనరావు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాలీ లారీలో ఇనుప కడ్డీలు మాటున యర్రవరం టోల్‌గేట్ వద్ద లోడ్ చేసుకుని మహారాష్ట్రలోని అహ్మదాబాద్‌కు తరలిస్తున్న 287 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎస్‌ఐ కె.జగన్మోహనరావు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయిస్ డీటీ సునీత, వీఆర్వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

మహారాష్ట్ర బ్యాంక్ మొదటి వార్షికోత్సవం

యానాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యానాంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మొదటి వార్షికోత్సవాన్ని మేనేజరు సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రముఖులు, ఖాతాదారులతో సమావేశం ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి జ్ఞాపికలు అందజేశారు. బ్యాంక్ ప్రతినిధులు పి.సాయిరామకృష్ణ, గంగాధర్, వి.సురేష్ కుమార్, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.



దాతకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న దృశ్యం

నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం

అంతర్వేది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం రాజుల్లంకకు చెందిన మంతెన రామకృష్ణంరాజు-రాధామాధవి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. నిత్యాన్నదాన పథకానికి రూ.50,116 విరాళం అందజేశారు. దాత దంపతులకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి, విజయ నరసింహ పాల్గొన్నారు.



దీపం కుందులు బహూకరిస్తున్న భార్గవ్

ఇత్తడి దీపం కుందులు బహూకరణ

ఐ.పోలవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమలాపురానికి చెందిన కేతవరపు భార్గవ్-ప్రియాంక దంపతులు మురమళ్ళ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి సుమారు రూ.20వేలు విలువైన ఇత్తడి దీపం కుందులను సోమవారం ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాస రాజుకు అందజేశారు. దాత దంపతులను స్వామి చిత్రపటం, ప్రసాదంతో అర్చకులు సత్కరించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

మురమళ్ళ వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన ఆత్కూరి శివరామపవన్‌కుమార్ సోమవారం రూ.10వేలు విరాళాన్ని సహాయ కమిషనరు మాచిరాజు లక్ష్మీనారాయణకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ప్రత్యేక దర్శనం కల్పించి పూజలు చేయించారు. స్వామి చిత్రపటం, ప్రసాదంతో సత్కరించారు.

'ప్రభుత్వ ఆదేశాల అమలులో అలసత్వం వహిస్తే చర్యలు'

అల్లవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల అమలులో ప్రభుత్వ ఉద్యోగులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ హెచ్చరించారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బ్యాంకు ఖాతాలు లేనివారికి పోస్టాఫీసులో ఖాతాలు తెరిపించి బ్యాంకు ఖాతాకు, జాతీయ చెల్లింపుల కార్పొరేషన్‌కు లింక్ చేయించాలన్నారు. వీటిలో పురోగతి తగ్గినందున పంచాయతీల కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పూర్తి చేయించాలన్నారు. ఇటువంటి ముఖ్య అంశాల్లో అలసత్వం వహిస్తే ప్రజలకు నష్టాలు వాటిల్లితే చర్యలు తీసుకుంటామన్నారు. చైల్డ్ ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఈ నెల 19 నుంచి 22 వ తేదీ వరకు జరుగుతాయన్నారు. కార్యదర్శులు ఎస్.రాజమోహన్, ఎస్.దుర్గాశ్రీనివాస్, శంకరప్రసాద్, మృదుల పాల్గొన్నారు.



గ్రానైట్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం

అమలాపురం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ది అమలాపురం మార్బుల్, గ్రానైట్, టైల్స్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని బైపాస్ రోడ్డులోని సతీష్ మార్బుల్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడు మండేల బుజ్జి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నక్కా రాంబాబు, ఉపాధ్యక్షుడిగా బండారు సురేష్, కార్యదర్శిగా ముషిణి నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా చిటికెన ప్రసాద్, కోశాధికారిగా నందెపు బుజ్జి, ఉప కోశాధికారిగా పల్లి రమేష్‌బాబు, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కార్తీక వనసమారాధన నిర్వహించారు.

ఓడలరేవు తీరంలో అడవి పంది

అల్లవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడలరేవు తీరంలో డ్రైన్‌లో పడిపోయిన అడవి పందిని స్థానికులు పట్టుకున్నారు. గోదావరి వరదలకు కొట్టుకువచ్చిన అడవి పందులు కొమరగిరిపట్నం, ఓడలరేవు తీర గ్రామాల్లో సరుగుడు తోటలు, తుప్పల్లో ఉంటున్నాయి. ప్రమాదవశాత్తు ఓఎన్జీసీ డ్రైన్‌లో పడిపోయిన పందిని స్థానికులు వల వేసి పట్టుకున్నారని గ్రామస్థులు తెలిపారు. దీనిపై అటవీ శాఖకు సమాచారం అందించేందుకు సిద్ధపడుతున్నారు.





ఐ.పోలవరం: మురమళ్లలో వీరేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, అంబాజీపేటలో ప్రత్యేక అలంకరణలో వీరేశ్వరస్వామి, పి.గన్నవరంలో గరుడేశ్వర స్వామికి క్షీరాభిషేకం

హర హర మహాదేవ శంభో శంకర

ఐ.పోలవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడవ సోమవారం మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలాచరించి వీరేశ్వరునికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఐ.పోలవరం, కేశనకుర్రుపాలెం, బాణాపురం, టి.కొత్తపల్లి, గుత్తెనదీవి, ఎదుర్లంక శివాలయాలకు భక్తులు పోటెత్తారు. భైరవపాలెంలో కాలభైరవుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది.

అమలాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): బండారులంకలోని శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఏకాహం నిర్వహించారు. అనంతరం 2500 మందికి అన్నసమారాధన చేశారు. మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, కొండా చంటి, గోళ్ల మల్లేశ్వరరావు, చింతా ఉమా, బిళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అల్లవరం (ఆంధ్రజ్యోతి): అల్లవరం ఉమామల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళంపల్లి పాండురంగ విఠల్ బ్రహ్మత్వంలో వేదపండితుడు చంద్రమౌళి కృష్ణమూర్తి పర్యవేక్షణలో లక్ష బిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. నడింపల్లి సూర్యనారాయణ రాజు కుటుంబ సభ్యులు లక్ష బిల్వార్చన, సూర్య నమస్కారాలు జరిపించారు. పురాణ ప్రసిద్ధిపొందిన రామేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ అంగాని రామారావు తెలిపారు. లక్ష్మణేశ్వరం, శివాలయాలతో పాటు బెండమూర్లంక, బోడసకుర్రు, గోడిలంక, గోడి, దేవగుప్తం, అల్లవరం, తాడికోన శివాలయాల్లో అభిషేకాలకు భక్తులు పోటెత్తారు.

ముమ్మిడివరం (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని ఉమాసూరేశ్వరస్వామి, క్రాపచింతలపూడిలోని వల్లభేశ్వరస్వామి, కొత్తలంకలోని భోగమల్లేశ్వర స్వామి ఆలయాలు, అయినాపురం, ఠాణేలంక, అన్నంపల్లి, కొమనాపల్లి శివాలయాల్లో భక్తులు పంచామృత అభిషేకాలు, లక్షపత్రి పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి దీపోత్సవం జరిగింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలోని శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంబాజీపేట (ఆంధ్రజ్యోతి): ఏకాదశ రుద్రుల దర్శనానికి తాడేపల్లిగూడెం, తణుకు, కొవ్వూరు, రావులపాలెం డిపోల నుంచి బస్సుల్లో సుమారు 1,200 మంది భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే శివాలయాల్లో అర్చకులు స్వామివార్లకు అభిషేకాలు చేశారు. పరమశివుని దర్శనానికి భక్తులు బారులు తీరారు. మాచవరంలోని శ్రీ పార్వతీ రాజేశ్వరస్వామి ఆలయంలో మాస లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కారుపల్లి, వై.కొత్తపల్లి, ఉడిమూడి, మానేపల్లి, మొండెపులంక, నరేంద్రపురం, కుందాలపల్లి, ముంగండ, బెల్లంపూడి గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

రాజోలు (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజోలు, కడలి, శివకోటి, సోంపల్లి, పొన్నమండ, తాటిపాక, వేగివారిపాలెం గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే లక్షపత్రి పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపించుకున్నారు. సాయంత్రం ఆలయాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు.

అంతర్వేది (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సముద్ర, నదీ పుణ్యస్నానాలు ఆచరించి క్షేత్ర పాలకుడైన పార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. గుడిమూల కృతకృత్య రామలింగేశ్వరస్వామి, మోరి సీతారామలింగేశ్వరస్వామి, సఖినేటిపల్లి, అంతర్వేది శివాలయాల్లో కార్తీక దీపారాధన చేశారు. అంతర్వేది ఆలయ ప్రాంగణంలోని వేప చెట్టు, ప్రధానాలయ గోపురం వెనుక భాగంలో దీపాలు వెలిగించారు. దర్శనానంతరం అన్నప్రసాదం స్వీకరించారు.

మామిడికుదురు (ఆంధ్రజ్యోతి): మొగలికుదురులోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం, పెదపట్నంలంకలో ఉమాసత్యలింగేశ్వరస్వామి, పాశర్లపూడి బాడవలోని శివాలయంలో లక్ష బిల్వార్చనలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి లక్ష బిల్వార్చన, మహాలింగార్చన, పండ్ల రసాలతో అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చన జరిపారు. శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.

లైంగిక దాడిపై కేసు నమోదు

ఉప్పలగుప్తం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిత్తనచెరువులో సోమవారం ఒక యువకుడు పక్కింటి ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ దర్యాప్తు చేశారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

అమలాపురం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి సహకార ఉద్యోగులంతా కృషి చేయాలని జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలతో సహకార సంఘాలన్నీ పూర్తిస్థాయిలో కంప్యూటరీకరిస్తున్నారని చెప్పారు. దీనివల్ల సహకార వ్యవస్థ పారదర్శకంగా మారుతుందన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం అమలాపురం శ్రీకళా వెంకట్రావు పీఏసీఎస్‌లో డివిజనల్ సహకార అధికారి ఎ.రాధాకృష్ణరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మురళీకృష్ణ మాట్లాడుతూ సహకార సంఘాల సమావేశాలు కోరం అయ్యేలా చూడాలని సూచించారు. సభ్యులతో సహకార ప్రతిజ్ఞ చేయించారు. పర్సన్ ఇన్‌చార్జి ఎ.లహరి సొసైటీ ప్రగతిని వివరించారు. నాగాబత్తుల రాజారావును సత్కరించారు.

అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ

ఉప్పలగుప్తం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాడుక భాషలో తెలుగు కవిత్వం వికసించడానికి నూతన పద్ధతిలో తన కలాన్ని కదిలించిన గురజాడ వెంకటఅప్పారావు అభ్యుదయ కవితా పితామహుడని సాహితీవేత్త నల్లా నరసింహామూర్తి అన్నారు. భీమనపల్లి గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయాధికారి నిమ్మకాయల శేషుకుమార్ అధ్యక్షతన జరిగిన సాహితీ సభలో 'మహాకవి గురజాడ రచనలు-సంఘ సంస్కరణలు' అంశంపై ఆయన ప్రసంగించారు. న్యాయవాది అద్దంకి అమరేశ్వరరావు 'విశ్వనాథ కవిత్వం-తెలుగుసంస్కృతి' అంశంపై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, కవితా పోటీలు జరిగాయి.

రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసులకు శిక్షణ

అమలాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను ఐఆర్ఏడీ యాప్ ద్వారా గుర్తించి అక్కడి సమస్యలను పరిష్కరించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. సమగ్ర రహదారి ప్రమాద సమాచార నమోదు శిక్షణా తరగతుల్లో భాగంగా సోమవారం జిల్లాలోని 25 పోలీసుస్టేషన్ల సిబ్బందికి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎస్పీ శిక్షణను ప్రారంభించారు. కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ వరకు ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటా బేస్ నమోదుపై శిక్షణ ఇచ్చారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి దర్యాప్తు అధికారి వెళ్లి అక్కడ ప్రభుత్వం రూపొందించిన ఐఆర్ఏడీ యాప్ ద్వారా సమాచారాన్ని పంపించాలన్నారు. ప్రమాదంలో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు బీమా సొమ్ము త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించి బతికించిన వారికి గోల్డెన్ అవర్స్ స్కీమ్ ద్వారా అవార్డులు అందజేస్తామన్నారు. శిక్షణలో ఐఆర్ఏడీ రోల్ అవుట్ మేనేజర్ జీవీ రామారావు, డీసీఆర్బీ సీఐ వి.శ్రీనివాస్ అనేక అంశాలపై పోలీసు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.



విరాళం చెక్కు అందజేస్తున్న మోరి స్వామి అయ్యప్ప పీఠం సభ్యులు

అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి రూ.8.10 లక్షల విరాళం

మలికిపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మలికిపురంలో హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి మోరికి చెందిన దివంగత పేరాబత్తుల సుబ్బారాయుడు స్వామి అయ్యప్ప స్వాముల పీఠం తరపున రూ.8.10 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులైన మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, దెందుకూరి రాంబాబురాజు, మిరియాల హనుమంతరావులకు చెక్కు రూపంలో సోమవారం అందించారు. కార్యక్రమంలో పీఠం తరపున గురుస్వామి పల్లపోతు పూర్ణయ్యస్వామి, పేరాబత్తుల దొరబాబుస్వామి, రావూరి నాగుస్వామి, వర్ధినీడి శ్రీనుస్వామి, జక్కంపూడి పెదరాజుయుడు స్వామి పాల్గొన్నారు.

అమలాపురం డీఎస్పీ మానవత్వం

ఉప్పలగుప్తం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళను పరామర్శించి, ఆసుపత్రికి పంపించి ఒక పోలీసు అధికారి మానవత్వం చాటుకున్నారు. అమలాపురం-ఎస్.యానాం ఆర్అండ్‌బీ రహదారిపై కిత్తనచెరువు వద్ద సోమవారం బైక్‌పై వెళ్తున్న చల్లపల్లికి చెందినకుంపట్ల భేతాళమ్మ ప్రమాదవశాత్తూ పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళ్తున్న అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ తన వాహనం దిగి వచ్చారు. బాధితురాలి పరిస్థితికి చలించారు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేయగా గంట సమయం పడుతుందని సమాచారం వచ్చింది. దీంతో అటుగా వస్తున్న ఆటోను ఆపి బాధితురాలిని ఎక్కించి అమలాపురం ఆసుపత్రికి తరలించారు.



గాయపడిన మహిళను ఆసుపత్రికి పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్న డీఎస్పీ ప్రసాద్

ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతే నష్టపరిహారం: ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ సంస్థ మత్స్యకారులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా డిసెంబరు 12 తర్వాత పంపిణీ చేస్తామని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు చెప్పారు. ఓఎన్జీసీ ద్వారా మత్స్యకారులకు రావలసిన రూ.149కోట్ల సొమ్మును ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న పంపిణీ చేయవలసి ఉందన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పరిహారం సొమ్మును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని వివరించారు. పంపిణీ తేదీని ఎన్నికల కోడ్ అనంతరం ఖరారు చేస్తామన్నారు.

'రొడ్డా భవానీ కేసును పునర్విచారణ చేయాలి'

అమలాపురం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి రొడ్డా భవానీ ఆత్మహత్య కేసును పునర్విచారణ చేయాలని కోరుతూ వివిధ సంఘాల నాయకులు సోమవారం ఎస్పీ బి.కృష్ణారావును కలిసి అర్జీ అందించారు. భవానీని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రధాన అనుచరుడైన ఉప్పలగుప్తం ఎంపీపీ భర్త దంగేటి రాంబాబుకులం పేరుతో దూషిస్తూ మానసికంగా వేధించడం వల్లే ఆత్మహత్యకు పాల్పడిందని వివరించారు. ఎఫ్ఐఆర్‌లో రాంబాబు పేరు చేర్చినప్పటికీ గత వైసీపీ ప్రభుత్వ అండతో కేసు నుంచి అతడి పేరును తప్పించారని ఆరోపించారు. కేసును పునర్విచారణ చేసి అసలైన దోషులను అరెస్టు చేయాలని భవానీ భర్త బారతి వెంకటేశ్వరరావు, వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు అమలదాసు బాబూరావు, మచ్చా నాగయ్య, కుమ్మరి రమణ, పెయ్యల ప్రతాప్ డిమాండ్ చేశారు.

సత్తెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

కాట్రేనికోన, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన పంచాయతీ కొత్తపాలెంలో సోమవారం సత్తెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. సుంకర వెంకటరమణ దంపతులు పూజలు జరిపారు. మత్స్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు గంటివెంకటసుధాకర్, రంబాల రమేష్, దొమ్మేటి పావనివెంకట్రావు, నాయకులు సంసాని నాగేశ్వరరావు, రాజా కాకర్లపూడి తాతాజీ, కంచుస్తంభం సోనీ, వాసం సత్యనారాయణ, ముత్యాల నరసింహమూర్తి, పసల సాయిబాబా, కోలా నాగేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, సుంకర పవిత్రకుమార్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ముమ్మిడివరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి 17 వరకు పశ్చిమ గోదావరి జిల్లా పోలసానిపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన జోన్-2 మూడు జిల్లాల జోనల్ మీట్‌లో ముమ్మిడివరంలో గురుకుల పాఠశాల విద్యార్థినులు బహుమతులు సాధించారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో చెస్ జూనియర్స్ విభాగంలో వి.భావన ప్రథమ, కేరమ్స్ సీనియర్స్ విభాగంలో భువన, గాయత్రి ద్వితీయ స్థానం సాధించారు. విజేతలను ప్రిన్సిపాల్ టి.గంగాభవాని అభినందించారు. వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు యు.ప్రమీలారాణి, ఎ.చాముండేశ్వరిలను అభినందించారు.

బెల్ట్ షాపు నిర్వాహకుల అరెస్టు

అమలాపురం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎల్.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం అమలాపురం మండలంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తున్న చిట్టూరి నాగరాజు, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, పప్పుల సుబ్బారావులను అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఇద్దరు పాత నిందితులు ఉండడంతో రిమాండుకు తరలించారు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రులో అనధికారికంగా బెల్టుషాపు నిర్వహిస్తున్న నేదునూరి గువ్వయ్యను అరెస్టు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

బాక్సింగ్ పోటీలకు 36 మంది ఎంపిక

మామిడికుదురు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ బాక్సింగ్ పోటీలకు 36 మంది ఎంపికైనట్టు జాయింట్ సెక్రటరీ చిట్టూరి చంద్రశేఖర్ సోమవారం తెలియజేశారు. మొగలికుదురు హైస్కూలు ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో ఎంపికలు జరిగాయి. అండర్-14 బాలుర నుంచి 13 మంది, అండర్-17 బాలుర, బాలికలు 23 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జొన్నలగడ్డ గోపాలకృష్ణ, బొంతు మధుకుమార్, పీఈటీలు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక, పారిశ్రామిక కేంద్రంగా అంతర్వేది'

అంతర్వేది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు పారిశ్రామిక కేంద్రంగా కూడా అభివృద్ధి చెందుతుందని బీజేపీ జాతీయ నాయకుడు సోము వీర్రాజు అన్నారు. సోమవారం ఆయన శ్రీలక్ష్మీనరసింహస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. రాజ్యలక్ష్మి, తాయారు అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. వేద పండితులు మహదాశీర్వచనం ఇచ్చారు. అనంతరం వీర్రాజు విలేకరులతో మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో నాలుగు వరుసల రహదారులతో పాటు రైల్వే లైన్ పనులను సకాలంలో పూర్తిచేయడానికి కేంద్రం కృషి చేస్తుందన్నారు. అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరును ఆనుకుని త్వరలో పరిశ్రమలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అయ్యాజీవేమా, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివ రామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, మండల శాఖ అధ్యక్షుడు పట్టాపు సూర్యప్రకాశరావు, పోతురాజు సురేష్, యెనుముల సుబ్బారావు, పడాల శివశంకర్, గెద్దాడ గణేష్, ఇందుకూరి అచ్యుతరామరాజు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.




వీర్రాజు కుటుంబీకులకు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు, వేద పండితులు

'ఇంధన అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలి'

అమలాపురం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమంగా జరుగుతున్న ఇంధన వ్యాపారాన్ని అరికట్టాలని పెట్రోల్, డీజిల్ బంక్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జవ్వాది తాతబాబు, దాసరి రత్నాకర్ ఆధ్వర్యంలో బృందం సోమవారం కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కలిసి వినతిపత్రం అందజేసింది యానాం నుంచి పెట్రోల్, డీజిల్‌ను అక్రమంగా తరలించి వ్యాపారాలు సాగిస్తున్నారని, దీనివల్ల బంకు యజమానులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని వివరించారు. యానాం, అమలాపురంల్లో జరుగుతున్న పెట్రోల్, డీజిల్ అమ్మకాలను పరిగణలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మను కలిసిన పెట్రోల్ బంక్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



సత్తిబాబురాజును అభినందిస్తున్న నామన రాంబాబు

క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌కు అభినందనలు

అయినవిల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యపరాజు వెంకటసత్తిబాబురాజును టీడీపీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు సోమవారం కలిసి దుశ్శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధరరావు, హెచ్ఆర్డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు, గణపతి వీరరాఘవులు, సలాది పుల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాత పెంకుటిల్లు గోడ కూలి వ్యక్తి మృతి

పి.గన్నవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందాలపల్లిలో పాత పెంకుటిల్లు గోడ కూలి వ్యక్తి మృతి చెందాడు. కాసర శ్రీనివాసరావు తన పాత పెంకుటిల్లును కూల్చాలని కొత్తపేట మండలం వానపల్లి గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన కామిశెట్టి సూరిబాబును కోరాడు. దీంతో సూరిబాబు అదే ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబంలోని గంధం దుర్గాప్రసాద్, సత్యనారాయణ, ఆదినారాయణలను కుందాలపల్లి తీసుకువచ్చాడు. పెంకుటిల్లు గోడలు కూల్చివేస్తున్న క్రమంలో సుమారు ఉదయం పది గంటలకు ప్రమాదవశాత్తు గోడ కూలి ఆదినారాయణపై పడింది. తలకు తీవ్ర గాయం కావడంతో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆదినారాయణ అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సోదరుడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.



మ్యూజికల్ చైర్స్

మత్స్యకార మహిళలకు పోటీలు

యానాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్య శాఖ ఆధ్వర్యంలో జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. మత్స్య శాఖ సహాయ సంచాలకుడు దడాల గొంతయ్య, ఇతర అధికారులు పర్యవేక్షించారు.



ఆకట్టుకున్న ముగ్గు

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, క్విజ్ పోటీలు

కపిలేశ్వరపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి డి.శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు, 50 మంది పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు

ఆత్రేయపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు జరిపారు. ప్రకృతి పర్యావరణ, దేశ నాయకుల చిత్రాలు తదితర అంశాలపై జరిగిన కార్యక్రమానికి లొల్ల ఉపాధ్యాయుడు చిత్తాడ సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ పోటీలు జరిపారు.



ఆలమూరు మండలం పినపళ్ల వద్ద భారీ వాహనాల దెబ్బకు కృంగిపోయిన పంటకాలువ

కృంగిన పంట కాలువతో సాగుకు పాట్లు

సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని రైతుల వినతి

ఆలమూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సాగునీరు అందించాల్సిన పంటకాలువ వాహనాల రాకపోకలకు కృంగిపోవడంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆలమూరు మండలం పినపళ్ల పరిధిలోని వెదురుమూడి రోడ్డు నుంచి పినపళ్ల ఓఎన్జీసీకి వెళ్లే రహదారికి పక్కన ఉన్న పంటకాలువ పూర్తిగా కృంగిపోవడంతో సాగునీరు చేరక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పంట కాలువ ద్వారా పినపళ్ల, వల్లూరు గ్రామాలకు 600 ఎకరాలకు పైగా సాగునీరు చేరాల్సి ఉందని రైతులంటున్నారు. ఈ రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు జారిపోయి పంటకాలువ మూసుకుపోయిందని దీంతో సాగునీరు అందడంలేదని రైతులు వాపోతున్నారు. అధికారులు ఇక్కడి పరిస్థితిని గుర్తించి సాగునీరు సక్రమంగా దిగువ భూములకు చేరేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటి ఇబ్బందులు తొలగించాలి



పినపళ్ల పరిధిలో ఉన్న ఓఎన్జీసీ రోడ్డుపై భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్డు పూర్తిగా జారిపోయి పంటకాలువ మూసుకుపోయింది. ఇరిగేషన్ అధికారులు తక్షణం పంటకాలువను సరిచేసి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలి.

కోట అప్పారావు, రైతు పినపళ్ల

అగ్ని ప్రమాదంలో రూ.10 లక్షల ఆస్తినష్టం



చెల్లూరులో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన తాటాకిళ్లు. పక్క చిత్రంలో రోదిస్తున్న బాధిత కుటుంబాలు

రాయవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం చెల్లూరు గ్రామంలో ఆదివారం అర్థరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధం కాగా రూ.10 లక్షల ఆస్తినష్టం సంభవించింది. బాధితుల వివరాల ప్రకారం...అంబేద్కర్‌నగర్‌కు చెందిన యాళ్ల సుందరరావు, యాళ్ల సత్యనారాయణ కుటుంబాలు తాటాకింట్లో ఉంటున్నారు. ఆదివారం అర్థరాత్రి సత్యనారాయణ, సుందరరావులు గాఢనిద్రలో ఉండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బాధితులు మేల్కొని బయటకు వచ్చేలోపు అగ్నికీలలు వ్యాపించడంతో వారంతా బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. గ్యాస్ సిలెండర్లు లీక్ కావడంతో చుట్టు ప్రక్కల ఇళ్లవాళ్లు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న రామచంద్రపురం ఫైర్ ఆఫీసర్ ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఇళ్ల నిర్మాణ నిమిత్తం అప్పుగా చేసి తెచ్చిన నగదు, సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్ కార్డులు, ఇంట్లో ఉన్న సామగ్రి దగ్ధమైనట్టు వారు తెలిపారు. తమకు చెరో 5లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు బాధితులు తెలిపారు. ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని తహశీల్దారు ఐపీశెట్టి సిబ్బందితో పరిశీలించి బాధిత కుటుంబాలకు ఒకొక్కరికి 25 కిలోల బియ్యం అందజేశారు. బాధితులను టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, మాజీ సర్పంచ్‌లు నూనె ఏసుబాబు, మోరంపూడి రాజ్‌కుమార్, ముత్యాల సాయిరాం, సత్య ప్రసాద్ పరామర్శించారు.

ద్వారపూడి ఆసుపత్రిని పరిశీలించిన సబ్ డివిజనల్ అధికారిణి

మండపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలోనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రామచంద్రపురం సబ్ డివిజనల్ వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.ప్రశాంతి సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆమె సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. త్వరలో ద్వారపూడి పీహెచ్‌సీకి నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ కమిటీ వస్తుందని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో వున్న ఫార్మసి లేబరేటరి, అవుట్-ఇన్ పేషెంట్ విభాగాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు పి.జగదీష్, అనుష, సునీత, రామచంద్రపురం డివిజన్ హెల్త్ సూపర్‌వైజర్ జి.కమల్, రత్నకుమారి, టీ.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రశాంతి



ఆలమూరు మండలం సంధిపూడిలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

ఆక్రమణల తొలగింపు

ఆలమూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం సంధిపూడిలో సోమవారం అధికారుల సమక్షంలో ఆక్రమణలు తొలగించారు. గ్రామంలో మెయిన్ రోడ్డులో, తొలగించిన బహిరంగ మరుగుదొడ్డి తొలగించి పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో సోమవారం అధికారుల సమక్షంలో ఆక్రమణలు తొలగించారు. ఈ ఆక్రమణల తొలగింపు వైసీపీ సానుభూతిపరులపై కక్షసాధింపుగా చేశారని ఆపార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణలు చేస్తున్న సమయంలోనే పంచాయతీ తీర్మానం లేనిదే నిర్మాణాలు చేపట్టవద్దని అప్పట్లో చెప్పినప్పటికీ దౌర్జన్యంగా నిర్మాణాలు చేపట్టారని కూటమి నాయకులు వాదిస్తున్నారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణి

ఆలమూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చింతలూరు ఎంపీపీ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు దాత అందించిన స్టీల్ వాటర్ బాటిల్స్‌ను సోమవారం ఆలమూరు ఎంఈవో అప్పాజీ పంపిణీ చేశారు. తిరుపతి ఎస్‌బీటీ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కెవీ.రామారావు ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్టీల్ బాటిల్స్‌ను సమకూర్చారు. వీటిని ఇక్కడి విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉడతా వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు వీఎస్ వీ.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు,



చింతలూరులో విద్యార్థులకు వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేస్తున్న ఎంఈవో అప్పాజీ

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

• ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు • కార్తీక దీపాలతో మహిళల సందడి



రాయవరంలో ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి

ఆత్రేయపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. వేకువజామునే మహిళలు పుణ్యస్నానాలు చేసి నదుల్లో దీపాలు వదిలారు. ర్యాలి ఉమాకమాండలేశ్వరస్వామి ఆలయంలో వేలాది మంది భక్తులు అభిషేకాలు చేశారు. ఆలయంలో మహిళలు దీపాలంకరణ జరిపారు. వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తారు. వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు.

ఆలమూరు: కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలమూరు విక్రమభట్టీశ్వరస్వామి ఆలయంతోపాటు మూలస్థానం, మడికి, చొప్పెల్ల, నర్సిపూడి, చింతలూరు, మోదుకూరు, గుమ్మిలేరు, పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, కలవచర్ల, పెనికేరు, నవాబుపేట, జొన్నాడ గ్రామాల్లోని శివాలయాలు ఉదయం నుంచే కిటకిటలాడాయి. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలను వెలిగించారు.

మండపేట: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. మండపేటలోని రథంగుడి అగస్తేశ్వరస్వామి, ఏడిద సంపమేశ్వరస్వామి, ద్వారపూడి, పాలతోడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజాము నుంచే భక్తులు బారులుతీరారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

కొత్తపేట: కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. పలివెల ఉమాకొప్పిలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు నారికేళ పంచామృతాలతో అభిషేకాలు చేశారు. దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో స్వామివారి దర్శనానికి తగిన ఏర్పాట్లు చేశారు.



ఆత్రేయపురం మండలం ర్యాలి ఉమాకమాండలేశ్వరస్వామి ఆలయంలో బారులుతీరిన భక్తులు

రాయవరం: మండలంలోని శైవక్షేతాలు భక్తుల శివనామ స్మరణలతో మార్మోగాయి. కార్తీకమాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని సోమేశ్వరం బాల త్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు పార్వతి సోమేశ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి. సోమేశ్వరంలో పురోహితులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సోమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చనలు చేశారు. వెంటూరు సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. రాయవరం పార్వతీ సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో విలపర్తి ఫణిధర్, శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో, రాయవరం అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, చెల్లూరు అగస్తేశ్వరస్వామి, లొల్ల ఉమా రామలింగేశ్వరస్వామి, వి.సావరం మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, పసలపూడి రాజేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. వేకువజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామివారి దర్శనా నికి బారులుతీరారు. కార్తీక నోములను పురస్కరించుకుని వేకువజాము నుంచే పార్వతి, పరమేశ్వరులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కపిలేశ్వరపురం: మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. కపిలేశ్వరపురం, అంగర, టేకి, మాచర, కోరుమిల్లి తదితర గ్రామాల మహిళలు, భక్తులు గౌతమి నదిలో వేకువజామునే పుణ్యస్నానాలు చేసి ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. కపిలేశ్వరపురం పాపవినాశేశ్వరస్వామి ఆలయంలో పలువురు అర్చకులు భక్తుల నుంచి నైవేద్యాలు స్వీకరించారు.

కె.గంగవరం: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు చేసి ఆలయంలో అభిషేకాలు చేశారు. ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. మండలంలోని కుందూరు శివాలయంలో అన్నసమారాధన చేశారు. యండగండి, పామర్రు, అముజూరు, పాణింగపల్లి, సత్యవాడ, గంగవరం, దంగేరు, యర్రపోతవరం, బాలాంత్రం, భట్లపాలిక, మసకపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాలు కిటకిటలాడాయి.



ప్రత్యేక అలంకరణలోనున్న ఆలమూరు విక్రమభట్టీశ్వర స్వామివారు

రావులపాలెం: మండలంలోని శైవక్షేత్రాల్లో స్వామివారికి అభిషేకాలు, లక్షబిల్వార్చన, అష్టోత్తర సహస్రనామ పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ద్రాక్షారామ: హసన్‌బాద గ్రామంలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో చింతపల్లి సతీష్, దేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఉండి వీరభద్రశర్మ బ్రహ్మత్వంతో అన్నాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ చేసిన దంపతులను సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు సత్కరించారు.

దేవరపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

రావులపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం దేవరపల్లి సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు ఈవోపీర్డీ జి.కృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలను అతిక్రమించి నిధులు ఖర్చుచేయడం, బిల్లులు లేకుండా నగదు డ్రా చేయడం, పనులు చేయకుండా బిల్లులు పెట్టడం తదితర అభియోగాలను ప్రశ్నిస్తూ గ్రామానికి చెందిన నామాల నాగేశ్వరరావు గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పట్లోనే డీఎల్పీవో విచారణ చేసి నోటీసులు జారీ చేశారన్నారు. దీంతో సోమవారం చెక్‌పవర్ రద్దు చేస్తూ ఉత్తర్వుల ఇచ్చిన్నట్టు ఆయన తెలిపారు.

పుంగనూరు పెయ్యిదూడ జననం

ఆత్రేయపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామానికి చెందిన రైతు పైడికొండల రాజుకు చెందిన ఒంగోలు సంకర జాతి ఆవుకు పుంగనూరు జాతి పెయ్యిదూడ జన్మించింది. కార్తీకమాసంలో ఇది జన్మించడంతో రైతు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఆధార్ శిబిరం

కపిలేశ్వరపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో నేటి నుంచి 29వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. ఈ శిబిరాల్లో ఆధార్ నమోదులు, మాండేటరీ బయోమెట్రిక్ అప్డేడ్, డెమోగ్రాఫిక్ నవీకరణలు, ఈ ఆధార్ నమోదు చేస్తారన్నారు. మంగళ, బుధవారాలు కపిలేశ్వరపురం, మాచర, వల్లూరు ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేశామన్నారు. తాతపూడి, టేకి, కాలేరు గ్రామాల్లో 21న, వెదురుమూడి, వాకతిప్ప, నల్లూరు గ్రామాల్లో 26, 27న, కోరుమిల్లి, అంగర, శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 28, 29 తేదీల్లో ఆధార్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాల నిర్వహణ

మున్సిపల్ కమిషనర్ రంగారావు

మండపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 29 వరకు పట్టణంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ టీ.రంగారావు తెలిపారు. మంగళవారం 7వ వార్డు సచివాలయం, 20న వల్లూరివీధి, 21న గౌతమి మున్సిపల్ హైస్కూల్, 22న మండపేట తహశీల్దార్ కార్యాలయం, 26న ఎస్.ఎస్.వీ.వీ మున్సిపల్ హైస్కూల్, 27న సత్యశ్రీరోడ్డు, 28న అంగన్వాడి సెంటర్, 29న పటేల్ మున్సిపల్ ప్రైమరి స్కూల్, రైతు బజారు వద్ద ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.



ఇటుకబట్టీల వద్ద బాలకార్మిక వ్యవస్థను వివరిస్తున్న అధికారులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి

ఆలమూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ ఒకరు బాధ్యతగా తీసుకుని పనిలోకి 18ఏళ్లలోపు వారిని పెట్టుకోవద్దని రాజోలు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కంభంపాటి భాస్కర్‌రామాంజనేయశర్మ సూచించారు. ఆలమూరులో సోమవారం ఆయన పలు శాఖల అధికారులతో కలసి ఇటుకబట్టీలు, షాపులు, హోటల్స్‌ను పరిశీలించి యాజమాన్యులు, కార్మికులకు అవగాహన కల్పించారు. 18ఏళ్లలోపు చిన్నారులను పని పెట్టుకుంటే నేరమని దీనికి శిక్ష అనుభవించాలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీవో శారదతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



వాడపలి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

వాడపల్లి ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. నోము ఆచరిస్తున్న మహిళలు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,85,413 వచ్చినట్టు ఉపకమీషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన మత్సటి శివ, సత్యవతి దంపతులు రూ.50వేలు విరాళం ఇవ్వగా వారికి స్వామివారి చిత్రపటం అందించారు.

బైపాస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

అసెంబ్లీ జీరో అవర్‌లో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తాపేశ్వరం-ద్వారపూడి బైపాస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం అసెంబ్లీ జీరో అవర్‌లో శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో బైపాస్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం భూసేకరణ చేయటం వల్ల గత ప్రభుత్వం బైపాస్ రోడ్డు నిర్మాణం జోలికి వెళ్లకుండా ఐదేళ్ల పాటు పట్టించుకోలేదన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి సీఎం చంద్రబాబు అప్పట్లో రూ.22 కోట్లను విడుదల చేసిన విషయాన్ని సభ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను ఆయన కోరారు. మండపేట నుంచి మారే డుబాక చిన్నవంతెన నిర్మాణం బైపాస్ రోడ్డు పనులకు సంబంధించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే వంతెన కాల్వపై పిల్లర్లు పూర్తయిన నేపథ్యంలో శ్లాబు వేసేందుకు నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ఎమ్మెల్యే వేగుళ్ల

లంక భూములను నదీకోత నుంచి రక్షించాలి

శాసనసభలో ప్రస్తావించిన ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): లంక భూములు నదీ కోతకు గురవుతున్న నేపథ్యంలో వాటిని రక్షించేందుకు గ్రోయిన్స్ నిర్మాణం చేపట్టాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం శాసనసభలో ప్రస్తావించారు. ఆయన మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గం గోదావరి వశిష్ఠ ఎడమగట్టు, గౌతమి కుడి, ఎడమగట్లు గుండా ప్రవహిస్తుందన్నారు. దీంతో వరదల సమయంలో కోతకు గురై సారవంతమైన లంక భూములు కొట్టుకుపోతున్నాయన్నారు. ముఖ్యంగా బడుగువానిలంక, కొమరాజులంక, వానపల్లి సత్తెమ్మలంక, పులిదిండి, పోలవరం, గోపాలపురం గ్రామాల లంక భూములు నదీ కోతకు గురవుతున్నాయన్నారు. శాసనసభ ద్వారా సంబంధిత శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. నదీకోత నివారించేందుకు గ్రోయిన్స్ నిర్మాణం చేపట్టాలన్నారు.



ఎమ్మెల్యే బండారు

విద్యుత్ డీఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

కొత్తపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేటలో విద్యుత్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని వినియోగదారుల సంఘ అధ్యక్షుడు సత్తిరాజు ఆదిత్యకిరణ్, గుబ్బల మూర్తి వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ గతంలో విద్యుత్ డీఈ కార్యాలయం కొత్తపేటలో ఉండేదని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉండగా అమలాపురం డివిజన్ కేంద్రానికి తరలించారన్నారు. ప్రస్తుతం కోనసీమ జిల్లాగా ఉన్న అమలాపురం నుంచి కొత్తపేట డివిజన్ ఏర్పడినందున కొత్తపేటలో కూడా విద్యుత్‌శాఖ డివిజన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయా లని కోరారు. కార్యక్రమంలో గమిడి శ్రీను, ఎస్.భీమేశ్వరరావు తదితరులు ఉన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్తులు

వైద్య శిబిరంలో 300 మందికి ఉచిత పరీక్షలు

ఆలమూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పినపళ్లలో ఉమెన్ డవలప్మెంట్ ట్రస్టు ఛైర్మన్, ఆలమూరు ఏజీపీ బూసి విద్యాప్రసన్న అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి, గౌతమి నేత్రాలయం, రమా దంతవైద్యశాలతో పాటు పలువురు వైద్యులు పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో పినపళ్ల సర్పంచ్ సంగిత సుబాష్, ఆలమూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, ఉపసర్పంచ్ యనమదల శ్రీను, ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న దృశ్యం



సంగమేశ్వరస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు కుటుంబ సభ్యులు

సంగమేశ్వరంలో ఎమ్మెల్సీ పూజలు

మండపేట. నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం ఏడిద సంగమేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. స్వామివారికి జరిగిన అన్నాభిషేకంలో ఆయన పాల్గొన్నారు, ఆలయ అర్చకుడు శర్మ సారద్యంలో పూజలు చేశారు. ఈ పూజల్లో ఆయన తనయుడు పృథ్వీ తదితరులు వున్నారు.

తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్‌ను కలిసిన గడి దంపతులు

మండపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకురాలు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ గడి సత్యవతి తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులయ్యారు. మంగళవారం తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ పాలవలస యశస్వీని తణుకు రాగా ఆమెను సత్యవతి దంపతులు కలిసారు. త్వరలో కార్పొరేషన్ కార్యవర్గం ప్రమాణస్వీకారం ఉంటుందని ఆమె చెప్పారని సత్యవతి తెలిపారు.

గ్రంథాలయంలో పేపర్ క్రాఫ్ట్ పై పోటీలు

ద్రాక్షారామ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ద్రాక్షారామ శాఖ గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌పై పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎం.వి. సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్రాఫ్ట్ ఉపాధ్యాయులు బీవీ సురేంద్ర, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సారాతో మహిళ అరెస్టు

ఆలమూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడలో నాటుసారా అమ్మకాలు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఆలమూరు ఎక్సైజ్ సిబ్బంది జరిపిన దాడిలో ఐదు లీటర్ల నాటుసారాతో మహిళను అరెస్టు చేశారు. జొన్నాడకు చెందిన ఎం.సూర్యకళ నాటుసారా అమ్మకాలు చేస్తుండగా పట్టుకుని ఐదు లీటర్ల సారాతో అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఆలమూరు సీఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపారు.

రాష్ట్ర నెట్‌బాల్ సెక్రటరీగా పల్లా శ్రీనివాసరావు

రావులపాలెం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): రావులపాలెం డాన్‌బాస్కో పాఠశాలలో పీఈటీగా ఉన్న పల్లా శ్రీనివాసరావు రాష్ట్ర నెట్‌బాల్ సెక్రటరీగా ఎంపికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర నెట్‌బాల్ నూతన అసోషియేషన్ ఎన్నికను నిర్వహించారు. ఉమ్మడి 13 జిల్లాల ప్రెసిడెంట్, సెక్రటరీలు పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నెట్‌బాల్ సెక్రటరీగా ఉన్న పల్లా శ్రీనివాసరావును రాష్ట్ర నెట్‌బాల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని జిల్లా ప్రెసిడెంట్ కర్రి అశోక్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లో వచ్చే యాంత్రిక లోపాలపై చర్యలు

రావులపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులలో ఏర్పడే యాంత్రిక లోపాలపై సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. రావులపాలెం ఆర్టీసీ గ్యారేజీలో బస్సుల యాంత్రిక లోపాలపై చర్యలు తీసుకున్నామన్నారు. అదే విధంగా సమయపాలన పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలపై డ్రైవర్లకు, కండక్టర్లకు అవగాహన కల్పించారు.